క్లుప్తంగా

14న హనుమాన్ జయంతికి ఏర్పాట్లు


పంచముఖ ఆంజనేయస్వామి

వరవాడ: ఈ నెల 14న ఆంజనేయస్వామి జయంతిని స్థానిక సినిమాహాలు కూడలిలో కొలువుదీరిన పంచముఖ ఆంజనేయుడి సన్నిధిలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని శ్రీ పైడిమాంబ యూత్ కమిటీ ప్రతినిధి బొద్దపు అయ్యబాబు చెప్పారు. ఆ రోజు వేకువ జాము నుంచి స్వామికి ప్రత్యేక హోమాలు పూజలు నిర్వహిస్తారు. పరవాడ పరిసర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసుకోవడానికి వీలు కల్పించారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు చెప్పారు. రాత్రికి ఆంజనేయ స్వామిని పుర వీధుల్లో ఊరేగిస్తారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


కబడ్డీ ఆటకు సిద్ధమవుతున్న విద్యార్థులు

సింహాచలం: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని అడవివరం గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం తెలిపారు. వేసవి విజ్ఞాన శిక్ష శిబిరంలో భాగంగా గురువారం పలు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన గ్రంథాలయాధికారి నరసింహం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. యోగ విజ్ఞాన సమితి వ్యవస్థాపకుడు బి.బి.రాజేంద్రప్రసాద్ యోగ విశిష్టతను తెలియజేశారు. యోగతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సూచించారు. ఎ.వి.భాను పిల్లలకు నీతి కథలు చెప్పారు. కార్యక్రమంలో క్రీడాకారుడు అజయ్, పాఠకులు, మోహన్, శంకర్, వర్మ, న్యాయవాది కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మ్యూజికల్ చైర్ పోటీలు


మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి శిరీష విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అనంతరం నిర్వహించిన మ్యూజికల్ చైర్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. సబ్బవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


శైలజ

సింహాచలం: యువతి అదృశ్యంపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఎస్ఐ ఎస్.కె.సత్యనారాయణ తెలిపిన వివరాలు.. పెందుర్తిలోని సింహగిరినగర్ సంపత్ రెసిడెన్సీలో ఉంటున్న నడుపూరి అప్పారావు కుమార్తె నడుపూరి శైలజ(23) ఎమ్మెస్సీ పూర్తి చేసింది. ఆమె ఈనెల 11వతేదీ గురువారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శైలజ తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్టు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

విజేతలకు అభినందన

అగనంపూడి: జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్‌టీఎల్, డీఆర్‌డీవో సంయుక్తంగా నిర్వహించిన ప్రాజెక్టు ఎక్స్‌పోలో దువ్వాడ విజ్ఞాన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. బి.సత్య సాహి, యశ్వంత్ సాయి, తేజు ప్రదర్శించిన రియల్ టై రికగ్నైజేషన్ అమెరికన్ సైన్స్ లాంగ్వేజ్, ఐవోటీ ఎనేబుల్డ్ గ్యాస్ లీకింగ్ డిటెక్టర్ ప్రదర్శనలకు గాను ఈ బహుమతులు దక్కాయి. వారిని రెక్టార్ వి.మధుసూదన రావు, సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ పి.వి.రవీంద్ర తదితరులు అభినందించారు.

నేలకు సారం.. పైరుకు పోషణ

- పచ్చిరొట్ట ఎరువుతో భూమికి రక్షణ
- పెరుగుతున్న సేంద్రియ ఎరువుల వినియోగం


గొర్లివానిపాలెంలో పచ్చిరొట్ట ఎరువులను ట్రాక్టర్‌తో కలియ దున్నుతున్న రైతు(ఫైల్)


సబ్బవరంలో పచ్చిరొట్ట ఎరువులను సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్న ఏవో

సబ్బవరం: పెరుగుతున్న జనాభాకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందించాలంటే సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలి. అధిక పంట దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో రైతులు పొలాల్లో బస్తాల కొద్దీ వివిధ రకాల రసాయన ఎరువులు.. లీటర్ల కొద్ది క్రిమి సంహార మందులు విచక్షణా రహితంగా వినియోగిస్తున్నారు. దీంతో నేల నిస్సారంగా మారి భూ స్థితిగతులు మారిపోతున్నాయి. మరోవైపు రైతులకు పెట్టుబడులు పెరిగిపోయి సాగు భారంగా మారుతోంది. రసాయనాల వల్ల నీరు,పర్యావరణం కలుషితమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నేల ఆరోగ్యవంతంగా,సారవంతంగా ఉండడానికి సేంద్రియ ఎరువులైన పశువుల గెత్తం,వర్మీ కంపోస్టు,కోళ్ల గెత్తం ,పచ్చి రొట్ట ఎరువుల వినియోగం పెంచడం ఒక్కటే మార్గం.

రాయితీపై విత్తనాలు

సేంద్రియ సాగు ప్రోత్సహించడానికి ప్రభుత్వం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తోంది. పచ్చిరొట్ట ఎరువులైన జీలిగ,జనుము,పిల్లి పెసర,అలసంద మొదలైనవాటిని వేసవి దుక్కుల అనంతరం వేసుకుని 50 శాతం పూత దశకు వచ్చిన సమయంలో భూమిలో కలియ దున్నడం వల్ల భూమి సారవంతమవుతుంది. తద్వారా తదుపరి వేసుకునే వరితో పాటు పలు పంటలు నాణ్యమైన దిగుబడులను సాధించడంతో పాటు క్రిమి సంహారక మందుల మోతాదు తగ్గించుకోవచ్చు.

పచ్చిరొట్ట విత్తనాలు రెడీ

పెందుర్తి నియోజకవర్గంలోని సబ్బవరం,పరవాడ, పెందుర్తి మండలాల్లోని 39 రైతు భరోసా కేంద్రాల్లో 10 టన్నుల వరకూ పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా సరఫరా చేసేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

పచ్చిరొట్ట విత్తనాలు వేయడం వల్ల ఉపయోగాలు

- పంటలకు కావాల్సిన సేంద్రియ పదార్థం అధికంగా భూమిలో లభిస్తుంది.
- నేలలో పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందుతాయి.
- నేలలకు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది.
- పాల చౌడును నివారిస్తుంది.
- సూక్ష్మ పోషకాలు ఎక్కువగా పంటలకు లభిస్తాయి.
- రసాయిన ఎరువుల మోతాదు తగ్గించుకోవచ్చు.
- తక్కువ వ్యయంతో ఆరోగ్యకరమైన పంటల దిగుబడి సాధించవచ్చు.

విత్తనం వినియోగం ఇలా..

విత్తన రకం	ఎకరాల్లో..	మోతాదు
జనుము	ఎకరాకు	8 నుంచి 10 కిలోలు
జీలుగ	ఎకరాకు	12 నుంచి 14 కిలోలు
పిల్లి పెసర	ఎకరాకు	6 నుంచి 8 కిలోలు

పచ్చిరొట్ట వైపు రైతుల మొగ్గు



గతంలో కంటే ప్రస్తుతం రైతులు సేంద్రియ సాగుకు మొగ్గు చూపుతున్నారు. పచిరొట్ట విత్తనాలు వేసిన 40 రోజుల తర్వాత నేలలో కలియ దున్నడం వల్ల భూమి సారవంతంగా తయారవుతుంది. రసాయిన ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చు. నేలల ఆరోగ్యం కాపాడుకోవచ్చు. రాబోయే తరాలకు మంచి సారవంతమైన భూములు.. ఆహారం అందించవచ్చు.

–పోతల సత్యనారాయణ,
మండల వ్యవసాయ అధికారి,సబ్బవరం.

● అధినేతకు ఆత్మీయ స్వాగతం



విశాఖ పర్యటనకు గురువారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హెలిప్యాడ్ వద్ద పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ మర్యాద పూర్వకంగా కలిశారు.పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

- ఘనంగా స్వర్ణపుష్పార్చన
- వైభవంగా నిత్యకల్యాణం


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు


స్వర్ణపుష్పాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈపూజ నిర్వహించారు. ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

డీఈవో చంద్రకళ

సింహాచలం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందని డీఈవో చంద్రకళ అన్నారు. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన జగనన్న విద్యా కానుక కిట్స్ స్టాక్ పాయింట్‌ను గురువారం ఆమె పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత ఎలాంటి ఆటంకం లేకుండా కిట్స్ పంపిణీ చేయాలని సూచించారు. పాఠశాలల వారీగా విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన జేవీ కిట్లు వివరాలతో రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని సూచించారు. తదుపరి నాడు-నేడు రెండో దశలో ఎంపికైన పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జుత్తాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నరవ వానిపాలెం, దువ్వపాలెం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, పులగాలిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. నరవానిపాలెం పాఠశాలలో వుయ్ లవ్‌రీడింగ్‌లో భాగంగా సమ్మర్ క్యాంప్ యాక్టివిటీస్, బుక్స్ పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అలాగే పది కాంపోనెంట్స్ పనులను జూన్ 11లో పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారి పైడపు నాయుడును ఆదేశించారు. ఎంఈవో పైడపునాయుడు మాట్లాడుతూ పెందుర్తి మండలానికి తొలి విడతగా పాఠ్యపుస్తకాలు 19,435, నోట్ పుస్తకాలు, 59,086 వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాడు-నేడు ఫీల్డ్ ఇంజినీర్ పి.పద్మ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సునీల్, బి.హరికృష్ణ, కె.రవికుమార్, ఎడ్యుకేషన్ సెక్రటరీ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో రాష్ట్ర సమాచార కమిషనర్


కప్పస్తంభానికి మొక్కు కుంటున్న జనార్దనరావు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం రాష్ట్ర సమాచార కమిషనర్ కట్టా జనార్దనరావు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు అందజేశారు. పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి


ఇండోర్‌స్టేడియం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

పరవాడ: గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్‌ఎం సమీపంలోని ఇండోర్‌స్టేడియం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఇటీవల కలెక్టర్‌ను కలిసి ఇండోర్ స్టేడియం స్థలాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో కలెక్టర్ గురువారం ఇండోర్‌స్టేడియం స్థలాన్ని పరిశీలించారు. స్టేడియంకు కేటాయించిన స్థలానికి హద్దులు నిర్ణయించడంతో పాటు పెరిగిన తుప్పలు, డొంకలు తొలగించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్ములు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దార్ వి.ప్రకాశరావు, శాప్ అధికారులు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైడింనాయుడు, వర్రి హరి పాల్గొన్నారు.

త్వరలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలు


చినయాతపాలెంలో సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

సబ్బవరం: ప్రసుత్తం ఉన్న పాత కమిటీలను రద్దు చేసి ఎనూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధసంఘాల కన్వీనర్ ముమ్మిడివరపు చిన సుబ్బారావు తెలిపారు. మండలంలోని ఆరిపాక శివారు చినయాతపాలెంలోని మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో తిరుపతి జరిగిన జాతీయ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం గో టు విలేజస్ విజన్-50 కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామం.. మండలంలో నూతన కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ అనకాపల్లి జిల్లా కన్వీనర్ గొటివాడ సామ్రాట్ కుమార్, సీనియర్ నాయకులు మారేడుపూడి కోటి అప్పారావు, కన్వీనర్లు కొల్లి చిన అప్పారావు,యలకమల్లి బాబు మాదిగ,ఇండుగబల్లి గోపి, బొర్రా జయరాజు, నీటిపల్లి కిరణ్, ఎం. శివాజీ పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ మారువారం

పరవాడ: పరవాడ గ్రామ ప్రజలు ఆరాధ్యదైవంగా కొలిచే ముత్యాలమ్మ మారు వారం పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు అందించే ఏర్పాట్లను ఉత్సవ కమిటీ చేపట్టింది.

బీసీ కార్పొరేషన్లకు నిధులివ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

అల్లిపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి వెనుకబడిన కులాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమారస్వామి కొనియాడారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సమస్యలపై సుదీర్ఘపోరాటం చేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ పదవినిచ్చి గౌరవించారన్నారు. తద్వారా బీసీలు జాతీయ వేదికగా తమ గొంతు వినిపించే అవకాశం కలిగిందన్నారు. కానీ బీసీ కార్పొరేషన్లలో తగినన్ని నిధులు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి వాటికి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రాష్ట్రంలో ఖాళీగా వున్న ప్రభుత్వ ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వారణాసి అన్నాజీ రావు, జిల్లా యువజన అధ్యక్షుడు ఉద్దండరావ్ వెంకటగిరి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ


సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన, లక్ష్మీహోమంలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ.. కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

కార్మికుల సమస్యలు పట్టని కేంద్ర ప్రభుత్వం

కూర్మన్నపాలెం: కార్మికులు పడుతున్న సమస్యలు కేంద్ర ప్రభుత్వానికి పట్టవా అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 819వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2 విభాగానికి చెందిన కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు నేటికీ దీనస్థితిలో ఉన్నాయని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటేనే మంచిదని అన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించాలని, లేదంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

యాగానికి తరలివెళ్లిన యాత్రికులు


విజయవాడ బయలుదేరిన బస్సు

సింహాచలం: రాష్ట్ర దేవదాయశాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న యాగానికి భక్తులు తరలివెళ్లారు. శుక్రవారం నుంచి ఈనెల 17 వరకు జరగనున్న అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యజ్ఞం ప్రారంభానికి సింహాచలం దేవస్థానం ఉచిత బస్సు ఏర్పాటు చేసింది. ఈ బస్సు గురువారం రాత్రి పలువురు భక్తులతో బయలు దేరింది. దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ కొబ్బరికాయ కొట్టి బస్సును ప్రారంభించారు. మార్గ మధ్యలో అనకాపల్లి, తదితర ప్రాంతాల్లో భక్తులు కలుస్తారని ఏఈవో తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గోపీనాథ్, పీఆర్వోనాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై శిక్షణ

సీతమ్మధార: వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు బాల వికాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి ఐదు రోజుల పాటు ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం గురువాయూరప్పన్ ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఉంటుంది. 14 నుంచి 40 ఏళ్ల వయసు గల బాలికలు, మహిళలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. వివరాలకు 85200 04288 నంబర్‌లో సంప్రదించవచ్చు.

జోరుగా ఎన్‌సీడీ-సీడీ సర్వే


డాక్టర్ సనపల రాజేంద్ర

కంచరపాలెం: వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 17 సచివాలయాల ప్రాంతాల్లో అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ-సీడీ) సర్వే జోరుగా సాగుతోంది. 14 మంది ఆరోగ్య కార్యకర్తలు, 17 మంది ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారని ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి సనపల రాజేంద్ర గురువారం తెలిపారు. సర్వేలో భాగంగా బీపీ, సుగర్, గుండె జబ్బులు, హార్మోన్ సమస్యలు, రక్తహీనత, కంటి సమస్యలు, క్యాన్సర్, మానసిక వ్యాధులు, కిడ్నీ సమస్యలు, ఊబకాయం, బీఎంఐ, దంత తదితర సమస్యలను గుర్తించి, ఎన్‌సీడీ-సీడీ యాప్‌లో నమోదు చేసి ప్రతి ఒక్కరికీ ఒక ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఎకౌంట్(ఏబీహెచ్ఏ) ఐడీని జనరేట్ చేస్తారని చెప్పారు. ఈ ఐడీ కోసం మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో లింక్ చేసుకోవాలని, లేనిపక్షంలో ఓటీపీ చెప్పాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ ఐడీ చేయించుకోవడానికి ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరికీ ఈ ఐడీ ఉండాలని, రానున్న రోజుల్లో ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లినా తప్పనిసరిగా అవసరమవుతుందని వివరించారు. ఆన్‌లైన్‌లో ఐడీ ఎంటర్ చేయగానే ఆ వ్యక్తి వ్యాధులు, మందులకు సంబంధించిన పూర్వ చరిత్ర తెలుస్తుందన్నారు. దీనివల్ల చికిత్స చేయడం తేలిక, సరైన చికిత్స అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని డాక్టర్ రాజేంద్ర కోరారు. ఎన్‌సీడీ సీడీ యాప్‌లో మొత్తం 45,851 మంది జనాభా మ్యాప్ అయ్యారని, 30,597 మంది ఐడీల జనరేట్ అయ్యాయని, ఇంకా 15,254 ఐడీలు చేయాల్సి ఉందన్నారు. ఇందులో వలస వెళ్లిన వారు, చనిపోయిన వారు, అందుబాటులో లేనివారు 300 మంది ఉంటారని తెలిపారు.

అచీవర్స్ డే విజయవంతంపై వీసీ హర్షం


కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలల జాబ్స్ అచీవర్స్ డే విజయవంతం కావడంపై వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమ నిర్వాహకులు, ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు, సిబ్బంది, వలంటీర్లతో వీసీ గురువారం ఏయూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో సమావేశమై అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్యులు, ప్లేస్‌మెంట్ అధికారి సంపూర్ణ కృషితోనే ఈ ఏడాది విద్యార్థులకు అత్యధిక ఉద్యోగాలు సాధ్యమయ్యాయన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఏటా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య సమత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శశిభూషణరావు, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టీ, పాలక మండలి సభ్యురాలు ఆచార్య శోభశ్రీ, ఆచార్య పాల్ డగ్లస్, తదితరులు పాల్గొన్నారు.